క్లుప్తంగా

వరద బాధితులపై ఉమా అనుచరుల దాడి హేయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద బాధితులపై ఎమ్మెల్యే బొండా ఉమా అనుచరుల దాడి హేయమని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు, వరదలకు నగర ప్రజలు సర్వం కోల్పోయి జీవచ్ఛవాలుగా మిగిలారని.. అటువంటి వారిపై దాడికి తెగబడటం సిగ్గుచేటని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజలు మాట్లాడే స్వేచ్ఛను కూడా కోల్పోయారని, పశ్చిమ ప్రాంతంలో ఎన్యూమరేషన్ జరగలేదని రోడ్డెక్కిన భవానీపురం కరకట్టవాసులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారన్నారు. అజిత్‌సింగ్ నగర్‌లో సాయం కోసం వెళ్లిన వ్యక్తిని స్తంభానికి కట్టేసి కొట్టిన ఘటన తీవ్రంగా కలిచివేసిందన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు ఓవైపు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఉదారంగా ముందుకు వస్తున్న తరుణంలో ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. ఎన్నుకున్న ప్రభుత్వమే తమ గోడు వినకపోతే ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలోని నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని టేనర్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో బుధవారం మత్తు పదార్థాల వాడకంతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గొల్లమూడి మాట్లాడుతూ విద్యార్థులు తెలిసో తెలియకో మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, తద్వారా వారు తమ జీవితాన్ని చేతులారా నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్నేహితులుగానీ, మరే ఇతర వ్యక్తులుగానీ మాదక ద్రవ్యాలకు ప్రలోభ పెడితే అవి ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరించారు. విద్యార్థి దశలో ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కుంగిపోతారని వివరించారు. అది నేర ప్రవృత్తి వైపు కూడా ప్రేరేపిస్తుందని చెప్పారు. నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎన్.దేవమణి మాటాట్లడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలైన బాలలు, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టేనర్ మెమోరియల్ హైస్కూల్ హెచ్ఎమ్ రాజేంద్ర బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాకు 24 మంది క్రీడాకారుల ఎంపిక



నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అండర్-19 కేటగిరీ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం బుధవారం జరిగింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికల్లో నున్న జెడ్పీ హైస్కూల్, ఎస్‌కేపీవీ హిందూ హైస్కూల్ కొత్తపేట నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి 24 మందిని ఎంపిక చేశారు. వెయిట్ 30 నుంచి 95 కేజీల బేసిక్‌గా క్రీడాకారుల ఎంపికలు కోచ్ ద్వారా జరిగినట్లు పీఈటీ విజయ్‌వర్మ తెలిపారు.

వరద బాధితులకు చేయూత

భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద బాధితులకు ఫెడరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. బుడమేరు వరద ముంపునకు గురైన రామరాజ్యనగర్, భవానీపురం ప్రాంతాల బాధితులకు బుధవారం సాయంత్రం గొల్లపూడి పంచాయతీ పరిధిలోని రామరాజ్యనగర్ రైల్ కరకట్ట వద్ద వాటిని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ విజయవాడ రీజినల్ సెక్రటరీ కె.రమేష్‌బాబు మాట్లాడుతూ.. ఏఐబీఈఏ జనరల్ సెక్రటరీ, ఏపీ టీబీఈఎఫ్ సెక్రటరీ బీఎస్ రాంబాబు పిలుపు మేరకు వరద బాధితులకు తమ వంతు సాయం అందజేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే బొమ్మసాని సుబ్బారావునగర్ ప్రాంతంలో ముంపు బాధితులకు 200 దుప్పట్లు పంపిణీ చేశామని చెప్పారు. కోవిడ్ సమయంలో కూడా తమ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సహాయ, సహకారాలను అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఈయు విజయవాడ రీజనల్ చైర్మన్ వేమూరి రామయ్య, ఏపీ, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు వై.శ్రీనివాసరావు, రాధాకృష్ణ, బాబు, రవి, సురేష్ కుమార్, యానిష్ కుమార్, హర్ష తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేస్తున్న యూనియన్ నాయకులు

ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

భవానీపురం/గాంధీనగర్: వరద బాధితులకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సాయం అందించింది. ఊర్మిళానగర్‌లోని ఫంక్షన్ హాల్లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ రామకృష్ణా సేవాశ్రమ సారథ్యంలో బాధితులకు బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బియ్యం, గోధుమ పిండి, నూనె, కందిపప్పు, చీరలు, దుప్పట్లు, టవల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వై.సుజనాచౌదరి మాట్లాడుతూ మానవత్వంతో వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన ఇన్ఫోసిస్ ఫౌండేషన్, రామకృష్ణ సేవా శ్రమ ప్రతినిధులను అభినందించారు. శ్రీరామకృష్ణ సేవాశ్రమ స్వామి జపానంద మహారాజ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గత 30 ఏళ్లగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతానికి వరదలు రావడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు అడ్డూరి శ్రీరామ్, చంద్రమౌళి, సతీష్, తిరుపతి అనూష, ఫౌండేషన్ సీనియర్ డెలివరీ ఇన్‌చార్జ్ వంశీ పరంజ్యోతి, దేవనబోయిన వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



మృతుల కుటుంబసభ్యులకు చెక్కులు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సేవలు అపూర్వం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న బాధిత కుటుంబాలకు విశ్రాంత బ్యాంకు ఉద్యోగ సంఘం అందిస్తున్న సేవలు అపూర్వమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ రీజనల్ హెడ్ ముువ్వల శ్రీధర్ అన్నారు. ఏపీ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్, ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల వరదల వల్ల నష్టపోయిన బ్యాంకు ఉద్యోగులకు నూతన వస్త్రాలు, వంట పాత్రల పంపిణీ వన్‌టౌన్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముువ్వల శ్రీధర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన వారిని ఆదుకుని వారు మామూలు జీవితం కొనసాగించేలా తోడ్పడాలన్నారు. సంఘం చైర్మన్ ఎంబీ శంకరరావు మాట్లాడుతూ.. వరదల వల్ల తమ సిబ్బంది విపరీతంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీబీఆర్ఎఫ్ అధ్యక్షుడు బి.వి.వి.కొండలరావు ప్రసంగిస్తూ బుడమేరు వరద ఉధృతి వల్ల జల ప్రళయంగా మారి సర్వస్వం కోల్పోయిన వారికి చేయూతనందించి ఆత్మ స్థైర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్లారావు, అధికారులు శారదామూర్తి, సీతారామారావు, ఐఎస్ఎన్ మూర్తి, రామారావు, సంఘం నేత బీఏ రాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ప్రభావిత ప్రాంతమైన జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో మరణించిన ఐదుగురి (జాన్సన్ రాజు, కందుల శ్రీను, కొలిపాక సీతమ్మ, వీరమ్మ, సొంటి దుర్గారావు) కుటుంబాలకు విశాఖకు చెందిన మైలాబత్తుల రాజరత్నం మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, ఓంశాంతి ట్రస్ట్, జాన్‌వెస్లీ ఫౌండేషన్, డీబీఆర్‌సీ సంస్థలు ఆర్థిక సాయం అందజేశారు. అదే విధంగా కొందరు బాధితులకు నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. బుధవారం వైఎస్సార్ కాలనీకి వచ్చిన ఆయా సంస్థల ప్రతినిధులు మృతుల నివాసాలకు వెళ్లి వారి కుటుంబసభ్యులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద ముంపు కారణంగా కాలనీలో పీకల లోతు వరద నీరు చేరుకుని గ్రౌండ్ ఫ్లోర్‌లు మునిగిపోయి సర్వం కోల్పోయిన బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని తెలిపారు. ముఖ్యంగా వరద కారణంగా కొందరు మరణించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక సేవే పరమావధిగా పని చేస్తున్న తమ సంస్థలు వారిని ఆదుకోవడం బాధ్యతగా భావించి సాయం అందించామని చెప్పారు. తొలుత కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దైవకళ, డాక్టర్ శివకుమార్, పీ.శ్రీలక్ష్మి, మానికొండ జోన్స్, శివాజీ, టీఎల్ రాజు, మల్లేశ్వరి, పాఠశాల హెచ్ఎమ్ యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి



వరద బాధిత కుటుంబాలకు సాయమందిస్తున్న ముువ్వల శ్రీధర్ తదితరులు

'అర్థం' గ్రూప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాల వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విజయవాడకు చెందిన 'అర్థం' గ్రూప్ సభ్యులు నోట్ పుస్తకాలు వితరణ చేశారు. బుడమేరు వరద ముంపు కారణంగా ఇళ్లు మునిగిపోయి పుస్తకాలు వరద నీటిలో కొట్టుకుపోవడం, కొన్ని తడిసి పనికిరాకుండాపోయిన నేపథ్యంలో పేద విద్యార్థుల దయనీయ పరిస్థితిని గమనించిన పాఠశాల ఉపాధ్యాయులు కె నెహ్రూ అర్థం గ్రూప్‌కు చెందిన శీతల్ జైన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన గ్రూప్ సభ్యులైన షా సమరత్‌మల్ అండ్ కో సౌజన్యంతో పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థులకు సుమారు రూ.60 వేల విలువైన రెండు వేల నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ వరద ముంపులో పిల్లల పాఠ్య పుస్తకాలతోపాటు రాసుకునే నోట్ పుస్తకాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారి చదువుకు ఆటంకం కలుగకుండా తమ వంతు సాయంగా నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ యూసఫ్, టీచర్ కె.నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న అర్థం గ్రూప్ సభ్యులు

• సాయం సరుకులు రోడ్డుపాలు



చెరువుకట్ట పై పారేసిన నిత్యావసర సరుకులు

వరదల కారణంగా సర్వం కోల్పోయి అన్నమో రామచంద్రా అంటున్న బాధితులు ఎందరో ఉన్నారు. అలాంటి వారికి పలువురు దాతలతో పాటు ప్రభుత్వం కూడా నిత్యావసరాలను అందిస్తోంది. అయితే సక్రమంగా బాధితులకు చేరడం లేదు. పైగా కొంత మంది టీడీపీ నాయకులు వాటిపై పెత్తనం చేస్తూ.. అవి పాడై పోయే వరకూ ఎవరికీ ఇవ్వకుండా ఆ తర్వాత పారబోస్తున్నారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడకు మూడు విడతలుగా వచ్చిన నిత్యావసరాల కిట్లను గ్రామ టీడీపీ నాయకులు వాటిని ఆ పార్టీ కార్యాలయంలో నిల్వ చేశారు. రాజకీయ పార్టీలకతీతంగా బాధితులకు పంపిణీ చేయాల్సిన నిత్యావసర సరుకులను రోజుల తరబడి స్టాకు చేయడంతో కుళ్ల పోయాయి. దీంతో గ్రామంలో పశువుల ఆస్పత్రి రోడ్డు చివరన ఉన్న ఎర్ర చెరువు కట్టరోడ్డుపై పారబోశారు. కుళ్లిపోయిన ఉల్లిపాయలు, బంగాళాదుంపలు అక్కడ కవర్లలో కనిపిస్తున్నాయి.

\- కె.తాడేపల్లి(విజయవాడరూరల్)

నూతన విద్యా విధానం రద్దు కోరుతూ ధర్నా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) డిమాండ్ చేసింది. నూతన విద్యావిధానం రద్దు చేయాలని కోరుతూ ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన్న, ఉపాధ్యక్షుడు ఉన్నం అనిల్‌కుమార్ మాట్లాడుతూ నూతన విద్యావిధానంతో ఉన్నత విద్య నిర్వీర్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వ విద్యాలయాలు, కళాశాలలో ప్రవేశాలు తగ్గిపోయాయని చెప్పారు. ఉన్నత విద్యనభ్యసించే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేయడం జరిగిందన్నారు. దీంతో అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారన్నారు. దీనికి సంబంధించిన జీఓ 77ను రద్దు చేసి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరారు. నూతన మెడికల్ కళాశాలలో సీట్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మహేష్, అధ్యక్షులు శివ, నాయకులు రాంబాబు, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఏ నాయకులు, విద్యార్థులు

ఎన్‌సీసీ ద్వారా అత్యుత్తమ భవిష్యత్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్‌సీసీ విద్యార్థులకు అత్యుత్తమ భవిష్యత్ సొంతమవుతుందని 17 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో నూతన విద్యా సంవత్సరం ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ బుధవారం జరిగింది. లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాతపరీక్ష, దేహదారుఢ్య పరీక్షలు, రన్నింగ్, వంటి వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించి ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా జీసీ పాండే మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ క్రమశిక్షణ, దేశభక్తి ఏర్పడుతుందని చెప్పారు. ఎన్‌సీసీ విద్యార్థులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దటానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మరో అతిథి, హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ.. కేబీఎన్ కళాశాలలో అనేక దశాబ్దాలుగా ఎన్‌సీసీ విభాగం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ సుబేదార్ మేజర్ మహీందర్‌సింగ్, సుబేదార్ సురేష్ చౌదరి, హవల్ నేత్ర తదితరులు ఎంపిక నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ కేపీటీ విజయభాస్కర్ నిర్వహణలో కార్యక్రమం కొనసాగింది.



మాట్లాడుతున్న కమాండింగ్ ఆఫీసర్ జీసీ పాండే

విద్యావంతులే సైబర్ మోసాలకు గురవుతున్నారు

ఏసీపీ దుర్గారావు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో బాగా చదువుకున్న విద్యావంతులే ఆన్‌లైన్ మోసాలకు అధికంగా గురవుతున్నారని విజయవాడ వెస్ట్‌జోన్ ఏసీపీ ఎన్.దుర్గారావు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కొత్తపేట పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మోసాలపై అవగాహన సదస్సును బుధవారం ఆ కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ ఎన్.దుర్గారావు మాట్లాడుతూ ఇటీవల ఆన్‌లైన్ ద్వారా మోసాలకు గురవుతూ లక్షలాది రూపాయాలు పోగొట్టుకుంటున్నారని చెప్పారు. ఆన్‌లైన్‌లో లోన్లు అందించే యాప్‌లు, ఇతర బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన మోసాలు వంటివి అధికంగా జరుగుతున్నాయని చెప్పారు. ఏ బ్యాంకూ తమ వినియోగదారుడిని పాస్‌వర్డ్ లేదా ఆధార్, పాన్‌కార్డుల నంబర్లు ఫోన్‌లో అడగవన్నారు. తెలియని లింక్‌లు ఫోన్‌లు కనిపించినప్పుడు క్లిక్ చేయకుండా ఉండాలన్నారు. యాప్ ద్వారా లోన్లు తీసుకొని పూర్తిగా చెల్లించినా ఇంకా అనేక రూపాల్లో వేధింపులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలన్నారు. విద్యావంతులైనా చిన్నపాటి అవగాహన లోపంతో మోసాలకు గురవుతున్నారని వివరించారు. సైబర్ క్రైమ్ సీఐ పలివేల శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో రిటైర్డ్ ఉద్యోగులు, మంచి అనుభవం కలిగిన విద్యావంతులు సైతం మోసాలకు గురికావటం ఆశ్చర్యానికి గురి చేస్తుందన్నారు. చిన్నపాటి ఏమరపాటుతో పాటుగా ఆన్‌లైన్‌లో చేస్తున్న లావాదేవీలు అధికారికంగా జరుగుతున్న అంశాలను పరిశీలించకపోవటంతో మోసాలకు గురవుతున్నారని వివరించారు. ఇటీవల వారి దృష్టికి వచ్చిన పలు కేసుల వివరాలను వివరించి విద్యార్థులను చైతన్యవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట సీఐ చిన్నకొండలరావు, సైబర్ క్రైమ్ ఎస్ఐ పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనృత్య కళా నిలయానికి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కళా నిలయానికి చెందిన గోనుగుంట శైలశ్రీ శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన అభినందించారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు కళావేదిక వద్దకు తరలివచ్చారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను భక్తులు అభినందించారు. శిష్య బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వీఎంసీని అగ్రస్థానంలో నిలపాలి

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరపాలక సంస్థను అగ్రస్థానంలో నిలపాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో బుధవారం సాయంత్రం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రెటరీ రూపామిశ్రా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా నగర పాలక సంస్థలు చేయవలసిన కార్యక్రమాలు, తీసుకోవాల్సిన చర్యలపై మిశ్రా కమిషనర్‌కు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవాలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో గుర్తించిన క్లీన్లీనెస్ టార్గెట్ యూనిట్స్‌ను త్వరితగతిన శుభ్రపరచాలని, లో-మీడియం, మీడియం- మీడియం, హై మీడియంగా విభజించి అందుకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని నిర్ధారించుకుని అనుకున్న కాల పరిమితిలో వాటిని శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా సెల్ఫీ పాయింట్స్‌ని పెట్టి ప్రజలకు మరింత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వభావం స్వచ్ఛత, సంస్కారం స్వచ్ఛతతో సెల్ఫీ పాయింట్స్ ఉండాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, స్వచ్ఛ సర్వేక్షణ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

మురుగు నీటిలోనే భక్తుల నడక

మహా మండపం వద్ద పొంగిన డ్రెయినేజీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి విచ్చేస్తున్న భక్తులు మురుగునీటిలోనే నడవాల్సి దుస్థితి మహా మండపం వద్ద ఏర్పడింది. శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. నిర్మాణాలకు అవసరమైన మెటీరీయల్‌ను మహా మండపం ఎదుట దిగుమతి చేశారు. దిగుమతి చేసిన ఐరన్ మ్యాన్‌హోల్స్‌పై ఉండటంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. మహా మండపంలోని అన్నదాన భవనం, నాల్గో అంతస్తులోని కార్యాలయాల మురుగు నీరు వెళ్లే డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోయింది. మూడు రోజులుగా మురుగు నీరు మ్యాన్‌హోల్స్ ద్వారా రోడ్డుపైకి ప్రవహిస్తోంది. రోడ్డుపైకి చేరిన మురుగు నీటిలోనే భక్తులు రాకపోకలు సాగిస్తున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులు మురుగు నీరు తొక్కుకుంటూ క్యూలైన్‌లోకి చేరుకోవాల్సి వస్తోంది. మరో వైపున సమస్యను మంగళవారం ఆలయ సిబ్బంది గుర్తించినా ఇంజినీరింగ్ శాఖ, శానిటేషన్ విభాగం పనని ఒకరిపై మరొకరు చెప్పుకొని పని తప్పించుకున్నారు. చివరకు బుధవారం మధ్యాహ్నం శానిటేషన్ సిబ్బంది మ్యాన్‌హోల్‌లో దిగి చెత్తను తొలగించేందుకు ప్రయత్నించారు. మ్యాన్‌హోల్‌పై ఐరన్‌ను పక్కకు తొలగిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని శానిటేషన్ సిబ్బంది పేర్కొంటున్నారు. అధికారులు ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



మ్యాన్‌హోల్స్ వద్ద పేరుకుపోయిన మురుగు



మురుగు నీటిలో నడుస్తున్న భక్తులు